

గెలిస్తే కేంద్ర వ్యవసాయమంత్రిని అవుతా : కుమారస్వామి

బెంగళూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండ్య లోక్‌సభ బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా తాను గెలిస్తే కేంద్రంలో వ్యవసాయశాఖ మంత్రిని అవుతానని మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మండ్యలో మాట్లాడుతూ తనను గెలిపించడం ద్వారా అభివృద్ధికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కుమారస్వామి వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మంగళవారం తీవ్రంగా స్పందించారు. కుమారస్వామి వ్యవసాయమంత్రి లేదా ఆర్థికమంత్రి కావచ్చు... తొలుత కేంద్రంలోఎన్డీయే గెలవాలి కదా అని ఎద్దేవా చేశారు. పగటి కలలు ఎవరైనా కనవచ్చు అన్నారు.

అంగరంగ వైభవంగా మలెమహదేశ్వర రథోత్సవం



కొండపై భారీగా భక్తులు



మలె మహదేశ్వర ఉత్సవమూర్తికి అలంకరణ

బెంగళూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉగాదిని పురస్కరించుకుని చామరాజనగర జిల్లాలో వెలసిన మలెమహదేశ్వర ఆలయ జాతరలో రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కర్ణాటక, తమిళనాడుతోపాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. మంగళవారం ఉదయం 7.30 గంటలకు రథోత్సవం ప్రారంభం కాగా 9.30 గంటల దాకా రథం సాగింది. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బేడగంపణ సామాజిక వర్గానికి చెందిన వారు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. సామాజిక వర్గానికి చెందిన 101మంది బాలికలు బెల్లపు హారతులను సాలూరు మఠం శాంతమల్లికార్జునస్వామి నేతృత్వంలో సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంపై ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి ఊరేగించారు. ఊఘే ఊఘే మాదప్ప అంటూ భక్తులు నినాదాలు చేశారు. ఈనెల 6న ప్రారంభమైన జాతర రథోత్సవంతో ముగిసినట్టు మలెమహదేశ్వర కొండ అభివృద్ధి ప్రాధికార కార్యదర్శి రఘు ప్రకటించారు. మూడు రోజుల జాతరకు రెండు లక్షలమందికి పైగా పాల్గొనగా రథోత్సవంలో రెండు లక్షల మంది పాల్గొన్నారని తెలిపారు. భక్తుల కోసం ఎటు చూసినా చలివేంద్రాలు కల్పించారు. అన్నదాసోహం నిర్వహించారు. జాతరలో భాగంగా భక్తులు పొర్లుదండాలతో మొక్కులు తీర్చుకున్నారు. జాతర కోసం ఆలయ చుట్టుపక్కల ప్రాంతాలన్నీ విద్యుత్ అలంకరణ చేశారు.



రథోత్సవంలో భక్తుల సందడి



పొర్లుదండాలు చేస్తున్న భక్తులు

దింగాలేశ్వరస్వామికి కాంగ్రెస్ గాలం..?

● ధారవాడ లోక్‌సభ టిక్కెట్ ఇవ్వడంపై పార్టీలో చర్చ



బెంగళూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ధారవాడ లోక్‌సభ స్థానం నుంచి స్వంతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించి మఠాధిపతి దింగాలేశ్వరస్వామికి కాంగ్రెస్ పార్టీ గాలం వేస్తోంది. ధారవాడ నుంచి బీజేపీ అభ్యర్థిగా మరోసారి ప్రహ్లాద్‌జోషి పోటీ చేస్తున్నారు. ఆయనను వ్యతిరేకిస్తూ దింగాలేశ్వరస్వామి పోటీకి సిద్ధమయ్యారు. కాంగ్రెస్ పార్టీ వినోద్ అసోటిని అభ్యర్థిగా ప్రకటించింది. దింగాలేశ్వరస్వామికి ధారవాడ పరిధిలో అపారమైన భక్తులు ఉండడం, ఈ ప్రాంతంలో లింగాయత సామాజిక వర్గానికి చెందినవారు అత్యధికంగా నివసిస్తున్న తరుణంలో దింగాలేశ్వరస్వామినే కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయించడం సముచితమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అభ్యర్థిని ప్రకటించాక మార్పులు జరిగిన సందర్భాలు ఉన్నాయి. కేపీసీసీలో డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ దింగాలేశ్వరస్వామికి పార్టీ టిక్కెట్ ఇచ్చే విషయమై పలువురు చర్చించారని, నాయకులంతా కలసి సమష్టి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

మోదీ పాలనలో వైద్యరంగంలో చారిత్రాత్మక మార్పులు

● బెంగళూరు గ్రామీణ బీజేపీ అభ్యర్థి డాక్టర్ సీఎన్ మంజునాథ్



బెంగళూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ పాలనలో వైద్యరంగంలో చారిత్రాత్మక మార్పులు జరిగాయని బెంగళూరు గ్రామీణ బీజేపీ అభ్యర్థి డాక్టర్ సీఎన్ మంజునాథ్ పేర్కొన్నారు. పార్టీ మీడియా సెంటర్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ దేశంలో స్వాతంత్ర్యం వచ్చేనాటికి మనిషి సాధారణ జీవితకాలం 37 ఏళ్లు ఉండేదని, ప్రస్తుతం 70ఏళ్లకు చేరిందన్నారు. దేశంలో కేవలం ఐదు ఎయిమ్స్ విద్యాసంస్థలు ఉండేవని, పదేళ్లలో 23కు పెరిగాయన్నారు. గుండెపోటు, రక్తపోటు, షుగర్, కేన్సర్ వంటి జబ్బులు పెరిగాయన్నారు. గుండెపోటు 40ఏళ్లలోపువారికే వస్తున్నాయన్నారు. పదేళ్ల క్రితం స్టెంట్ ధర రూ.1.70 లక్షలు ఉండేదని, ప్రస్తుతం మోదీ హయాంలో రూ.30వేలకే అందుబాటులోకి తెచ్చారని వివరించారు. ఏటా 30లక్షల మందికి దేశవ్యాప్తంగా గుండెపోట్లు వస్తున్నాయని, వారందరికీ సకాలంలో వైద్యం అందించే ఆసుపత్రుల సంఖ్య పెరిగిందన్నారు. జబ్బులతో బాధపడేవారు ఒకప్పుడు నెలకు వేల రూపాయల ఖర్చుతో మందులు కొనేవారని, ప్రధానమంత్రి జనౌషధి కేంద్రాల ద్వారా వందలకే లభ్యమవుతున్నాయని పేర్కొన్నారు. మార్కెట్‌లో వెయ్యి రూపాయల మందులు ఇక్కడ రూ.150కే లభిస్తున్నాయన్నారు. కర్ణాటకలో 1120 జనౌషధి మెడికల్ షాపులు ఉన్నాయన్నారు. కొవిడ్ క్లిష్ట సమయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యవహరించిన విధానాలను ప్రపంచ ఆరోగ్యసంస్థ కొనియాడిందన్నారు. అమెరికా, చైనా, జపాన్, యూరప్ వంటి దేశాలకంటే భారత్‌లోనే కొవిడ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నారని అన్నారు. జాతీయ, రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ బృందాలతో నిరంతరం వర్చువల్ సభల ద్వారా చర్యలు కొనసాగించారన్నారు. 270 కోట్ల వ్యాక్సిన్లు అందించారన్నారు. ఆక్సిజన్ కొరత లేకుండా వెంటిలేటర్ల సామర్థ్యాన్ని పెంచారన్నారు. దేశంలో లక్షకుపైగా ఐసీయూ బెడ్‌లు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఆరోగ్య టూరిజం పట్ల ఆదరణ పెరిగిందన్నారు. వివిధ దేశాలకు చెందినవారు ఇక్కడికి వచ్చి ఆపరేషన్లు చేయించుకుంటున్నారని తెలిపారు. జయదేవ ఆసుపత్రులలోనూ ఎన్నో దేశాలకు చెందినవారికి చికిత్సలు అందించామని అన్నారు. మీడియా సమావేశంలో మాజీ డీసీఎం అశ్వత్థనారాయణ, మాజీ మంత్రి మునిరత్న, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అశోక్‌గౌడ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు



ఇస్కాన్‌లో రాధాకృష్ణులకు అలంకరణ



బనశంకరి దేవి



మైసూరు చాముండేశ్వరి అమ్మవారు

బెంగళూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): క్రోధి నామసంవత్సర ఉగాది వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ఘనంగా జరిగాయి. పలు ఆలయాలలో విశేష పూజల అనంతరం పంచాంగశ్రవణం నిర్వహించారు. తదుపరి ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. బెంగళూరు రాజాజీనగర్‌లోని ఇస్కాన్ ఆలయంలో రాధాకృష్ణులకు ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. బనశంకరి ఆలయంలో విశేష హోమాలు నిర్వహించి పంచాంగ శ్రవణం పఠించారు. అమ్మవారికి విశేషపుష్పాలంకరణ చేశారు. నాడ దేవత మైసూరు చాముండేశ్వరి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు కొనసాగాయి.

టీటీడీ ఆలయంలో...

వయ్యాలికావల్‌లోని టీటీడీ ఆలయంలో స్వామివారికి ఆస్థాన సేవ అనంతరం పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సూపరింటెండెంట్ వి.జయంతి, టీటీడీ బోర్డు సభ్యుడు, మాజీ మంత్రి ఆర్‌వీ దేశ్‌పాండే పాల్గొన్నారు. స్థానిక సలహా కమిటీ మాజీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా మల్లేశ్వరంలోని కాడు మల్లేశ్వర ఆలయంలోనూ ఉగాది వేడుకలు సాగాయి. భ్రమరాంబ సమేత మల్లికార్జునుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాలలో భక్తులకు ఉగాది పచ్చడి సహా మజ్జిగ, పానకం, పెసరపప్పు పంపిణీ చేశారు.



టీటీడీ ఆలయంలో ఆస్థానసేవ



భగ్గుమంటున్న భానుడు

●పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ●రాయచూరులో 43 డిగ్రీల ఉష్ణోగ్రత ● కంప్లిలోనూ అదే తీరు



ఎండవేడిమిని తట్టుకోలేక చెట్టుకింద సేదతీరుతున్న గొర్రెలు, మేకలు



మార్కెట్లో అమ్మకాలకు సిద్ధంగా వున్న పుచ్చకాయలు

రాయచూరు/కంప్లి, ఏప్రిల్ 9 : ఈ ఏడాది మే నెలలో ఉండాల్సిన ఎండలు ఏప్రిల్ మాసంలోనే కనిపించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాయచూరులో మంగళవారం 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నం ప్రాంతంలో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. చల్లగా ఉండేందుకు ప్రజలు పుచ్చకాయలు, పండ్ల జ్యూస్‌లు, చల్లటి పానీయాలు, కళింగర కాయ, మజ్జిగ తీసుకుంటూ కొద్దిగా ఉపశమనం పొందుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి తాటిముంజలను నగరానికి తీసుకొచ్చి సెంట్రల్ బస్టాండ్, తీన్‌ఖందిల్ తదితర ప్రధాన సర్కిళ్లలో వ్యాపారులు అమ్ముతున్నారు. ఎండవేడిమి వల్ల భూమి ఆవిరికావడంతో ప్రజలు ఎక్కడ కూర్చున్న నెమ్మదిగా లేదు. కంప్లిలో 39 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. గతంలో ఎన్నడూలేని విధంగా కంప్లిలో ఈ యేడాది ఎండలు మండిపోతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు గ్రామ ప్రజలు రావాలన్నా వెనుకంజ వేస్తున్నారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు మాత్రమే అంతంత మాత్రంగానే వేడి వుండటంతో ఆలోపుగానే గ్రామాల నుంచి వచ్చి పనులు ముగించుకుని వెళ్లిపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారు మాత్రం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహిళలు కార్యాలయాలకు వెళ్లేందుకు ఎండ వేడిమిని తట్టుకునేందుకు గొడుగులను వెంటతీసుకు వెళుతున్నారు. గ్రామాల్లో యువకులు చెరువులు, కాలువల వద్దకు వెళ్ల నీటిలో ఈతకొడుతూ సేద తీరుతున్నారు. అడవుల్లో గొర్రెలు, మేకలు చెట్ల కిందే సేదతీరుతున్నాయి. పట్టణాల్లో పుచ్చకాయలకు, తాటి ముంజలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. రూ. 50 నుంచి రూ. 100 ధర పలికే పుచ్చకాయ ప్రస్తుతం రూ. 200 వరకు ధర పలుకుతోంది. తాటి ముంజలు డజను రూ. 30 నుంచి రూ. 50 పలుకుతున్నాయి. రాబోయే కాలంలో మరింత ఉష్ణోగ్రత పెరిగితే వడదెబ్బల ప్రభావం వుంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



రాయచూరు నగరంలో తాటిముంజలను విక్రయిస్తున్న మహిళలు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కుంచె...

డాక్టర్ శామ్యుయేల్ హానిమన్ (జయంతి)




జర్మనీ దేశానికి చెందిన 'హోమియోపతి పితామహ'గా పేరొందిన క్రిస్టియన్ ఫ్రెడ్‌రిచ్ శామ్యుయేల్ హానిమన్ 1755 ఏప్రిల్ 10న జన్మించారు. ఇంగ్లిష్, ఫ్రెంచ్, ఇటాలియన్, గ్రీక్, లాటిన్, అరబిక్, సిరియాక్, చాల్డియాక్, హెబ్ర్యూ తదితర భాషలలో నిష్ణాతులై బోధనలు, అనువాదం చేసేవారు. 1807లో హోమియోపతి పదాన్ని వాడారు. 1843 జూలై 2న కన్నుమూశారు.

స్వామి రామదాస్ (జయంతి)




స్వామి రామదాస్ 1884 ఏప్రిల్ 10న కేరళ రాష్ట్రంలో జన్మించారు. సాధువు, తత్వవేత్త, పరోపకారి, యాత్రికుడు. చిన్న వయస్సులోనే సన్యాసి అయ్యారు. కాసరగూడ్ జిల్లా కన్హన్‌గడ్‌లో ఆనందాశ్రమాన్ని ఏర్పాటు చేశారు. అనుచరులు, భక్తులకు 'శ్రీరామ జయరామ జయ జయరామ'ను ఉపదేశించారు. శ్రీరామనామ స్మరణ, ధ్యానం, ఇతరులకు సేవ చేయడాన్ని సూచించారు. 1963 జూలై 25న కన్నుమూశారు. ఇప్పటికీ ఆశ్రమం సేవలు కొనసాగుతున్నాయి.

జీడీ బిర్లా (జయంతి)




'పద్మవిభూషణ్' గ్రహీత ఘనశ్యామ్ దాస్ బిర్లా 1894 ఏప్రిల్ 10న రాజస్థాన్ రాష్ట్రం పిలాని గ్రామంలో జన్మించారు. భారత దేశపు అతిపెద్ద వ్యాపార సముదాయానికి యజమాని. కోల్కత్తాలో బట్టల వ్యాపారంలో రాణించి, దేశవ్యాప్తంగా వస్తు తయారీ యూనిట్‌లను స్థాపించారు. హిందూస్థాన్ మోటార్ సంస్థ సంస్థాపకుడు. సిమెంట్, రసాయనాలు, రేయాన్, స్టీల్ ఇలా పలు విభాగాలలో వ్యాపారాన్ని విస్తరించారు. యునైటెడ్ కమర్షియల్ బ్యాంకును, పిలానిలో బిట్స్, టిట్స్ ఇంజనీరింగ్ కాలేజీని స్థాపించారు. 1983 జూన్ 11న కన్నుమూశారు.

హెచ్ఎస్ దొరస్వామి (జయంతి)




స్వాతంత్ర్య సమరయోధుడు హరోహళ్ళి శ్రీనివాసయ్య దొరస్వామి 1918 ఏప్రిల్ 10న మైసూరులో జన్మించారు. 2018కి వందేళ్లు పూర్తి చేసుకున్నారు. పాత్రికేయుడిగా వ్యవహరించారు. 1950లో భూదానోద్యమంలో చురుగ్గా పాల్గొని గుర్తింపు పొందారు. స్వాతంత్ర్యానంతరం కూడా రైతులు, ఇతర కార్మికుల సమస్యల పోరాటంలోనూ, అవినీతి రహిత ఉద్యమంలోనూ పాల్గొన్నారు. గాంధీ సేవా పురస్కారం, బసవ, రామ్‌నాథ్ గోయెంకా జీవితసాఫల్యం పురస్కారం ఇతర గౌరవాలు అందుకున్నారు. 2021 మే 26న కన్నుమూశారు.

ఒమర్ షరీఫ్ (జయంతి)



ప్రముఖ హాలీవుడ్ నటుడు ఒమర్ షరీఫ్ 1932 ఏప్రిల్ 10న జన్మించారు. 1954లో 'సిరా ఫిల్-వాడి' అనే ఈజిప్షియన్ చిత్రంతో సినీరంగంలోకి అడుగు పెట్టారు. లారెన్స్ ఆఫ్ అరేబియా, డాక్టర్ ఝివాగో వంటి సినిమాల్లో అద్భుతంగా నటించి అంతర్జాతీయంగా పేరొందారు. 'లారెన్స్ ఆఫ్ అరేబియా' సినిమా ఆస్కార్‌కు నామినేట్ అయ్యింది. ఇదే సినిమాకు గోల్డెన్ గ్లోబ్ అవార్డు దక్కించుకున్నారు. మెకన్నాస్ గోల్డ్, ది టెన్ కమాండ్‌మెంట్స్, ది మెమొరీస్ ఆఫ్ మిడ్‌నైట్ వంటి సినిమాలు ఎంతో పేరొందాయి. 70కుపైగా సినిమాలలో నటించారు. 3 గోల్డెన్ గ్లోబ్ అవార్డులు, ఒక సీజర్ అవార్డు అందుకున్నారు. 2015 జూలై 10న కన్నుమూశారు.

ఏకే పళనివేల్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత ఏకే పళనివేల్ 1948 ఏప్రిల్ 10న తమిళనాడు రాష్ట్రం తంజావూరు ప్రాంతం హరిద్వారమంగళం గ్రామంలో జన్మించారు. డోలు వాయిద్య కళాకారుడు. తండ్రి ఎస్ కుమారవేల్ వద్ద, తదుపరి ముత్తు కుమారస్వామి పిళ్ళై వద్ద శిక్షణ పొందారు. సోలో ప్రదర్శనలు ఇచ్చారు. తమిళనాడు ప్రభుత్వ సంగీత కళాశాల, అమెరికాలోని వెస్లియన్ యూని వర్శిటీ, వేల్ యూనివర్శిటీలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. అన్నామలై యూనివర్శిటీలో సంగీత విభాగంలో 8ఏళ్ల డీన్‌గా వ్యవహరించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ, సంగీత చూడామణి, కళై మామణి తదితర అవార్డులు పొందారు. తిరు వయ్యారులోని త్యాగబ్రహ్మ మహోత్సవ సభకు కార్య దర్శిగా వ్యవహరించారు.

పండుగల వేళ మహిళల కోసం మీనా బజార్

బెంగళూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పండుగల సీజన్‌లో మహిళల ఇష్టపడే డిజైన్లను అందుబాటులో ఉంచేలా మీనా బజార్ ఏర్పాటైంది. చిత్రకళా పరిషత్‌లో ఏర్పాటు చేసిన మీనా బజార్‌ను నటి భూమిశెట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా భూమిశెట్టి మాట్లాడుతూ మహిళలు ధరించే ప్రతి వస్తువులోనూ కొత్తదనం, కళాఖండాలు ఉండాలని భావిస్తారని అందుకు అనుగుణంగానే మీనా బజార్‌లో వస్త్రాలు, గొలుసులు, గాజులతోపాటు పలు అలంకరణ సామగ్రి అందుబాటులో ఉంచారన్నారు. ఈనెల 14వరకు ప్రదర్శన ఉంటుందన్నారు.



అలంకరణ సామగ్రిని ఆసక్తిగా తిలకిస్తున్న యువతి

అహంకారిని గద్దె దించాలి : ప్రకాశ్‌రాజ్



ప్రసంగిస్తున్న నటుడు ప్రకాశ్‌రాజ్

బెంగళూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఒకే భాష - ఒకే పార్టీ - ఒక్కరే మహాప్రభు అంటున్న ఆ ప్రభు రెండు నాలుకల పాములాంటివారని, అబద్ధాల మహాపురాణం చెప్పడంలో తిరుగులేని వారని, అలాంటి అహంకారిని గద్దె దించాలని నటుడు ప్రకాశ్‌రాజ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'దేశాన్ని రక్షించండి' సంకల్పయాత్ర ముగింపులో భాగంగా సోమవారం బెళగావిలో ఆయన మాట్లాడారు. పరోక్షంగా ప్రధాని మోదీ పేరు ప్రస్తావించకుండానే మహాప్రభువు నగ్నత్వాన్ని బట్టబయలు చేస్తానని అన్నారు. మానవత్వం కల్గినవారు సర్వాధికారిని కిందకు దింపే బాధ్యత తీసుకోవాలన్నారు. మహాప్రభువు శాశ్వతం కాదన్నారు. సర్వాధికారి తొలి లక్షణాలు బాగా ఉంటాయని, మహాప్రభువు అహంకారం చివరిదశకు చేరిందన్నారు. అవినీతిపరులు ఆ పార్టీలో చేరి ఉత్తమలవుతున్నారని, సిగ్గులేని అహంకార పార్టీ బీజేపీయేనన్నారు. మన ప్రాంతానికి మన నాయకుడు కావాలని, ఆయన ముఖం చూసి ఓటు వేస్తే కంగనా రనౌత్‌కు ఓటు వేసినట్టే అవుతుందన్నారు. ప్రకాశ్‌రాజ్ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి తీవ్రంగా స్పందించారు. ప్రకాశ్‌రాజ్ వ్యాఖ్యలకు అంత ప్రాధాన్యత అవసరం లేదన్నారు. హుబ్బళ్ళిలో మంగళవారం మాట్లాడుతూ ఆయనో అసంతృప్తి జీవి అన్నారు. రాజకీయాల్లో ఆయన స్థానం ఏమిటో అందరికీ తెలిసిందే అన్నారు. ప్రకాశ్‌రాజ్, కమల్‌హాసన్ ఒక్క సీటు కూడా గెలవలేకపోయారని, వారుసైతం విమర్శలు చేస్తారన్నారు. ప్రకాశ్‌రాజ్ వ్యాఖ్యల్లో వాస్తవాలు ఉంటే 18 రాష్ట్రాల్లో బీజేపీ పాలన సాధ్యమా అని ప్రశ్నించారు.

రైల్వే బ్రిడ్జిని ఢీకొన్న లారీ : ఒకరు మృతి, మరొకరికి గాయాలు





ప్రమాదంలో మృతిచెందిన లారీ డ్రైవర్ అఫ్సర్, రైల్వే బ్రిడ్జిని ఢీకొన్న లారీ

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 9 : శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలోని మడకశిర వెళ్లే రహదారిలో మంగళవారం తెల్లవారుజామున రైల్వే బ్రిడ్జిని లారీ ఢీకొన్న ప్రమాదంలో అఫ్సర్(38) అనే వ్యక్తి అక్కడి కక్కడే మృతి చెందాడు. క్లీనర్‌కు తీవ్రగాయాలైన ట్లు హెడ్ కానిస్టేబుల్ దాదాపీర్ తెలిపారు. కర్ణాటకలోని రాంనగర్ జిల్లా చిన్నపట్నం గ్రామానికి చెందిన డ్రైవర్ అఫ్సర్, క్లీనర్ పర్వాన్ తుమకూరు నుంచి టెంకాయల లోడ్‌తో లారీలో బయలుదేరారు. పెనుకొండ సమీపం వద్దకు రాగానే మంగళవారం తెల్లవారుజామున వాహ నం అదుపుతప్పి మడకశిర రహదారిలో రైల్వేబ్రిడ్జిని ఢీకొంది. ఈ ప్రమాదంలో అఫ్సర్ అక్కడికక్కడే మృతి చెందగా క్లీనర్ పర్వాన్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన క్షతగాత్రులను పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్లీనర్ పర్వాన్‌ను మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఖాద్రీశుడి ఆలయంలో పంచాగ శ్రవణం





స్వామివారికి ఉయ్యాల సేవ, పంచాంగాన్ని పఠిస్తున్న వేదపండితులు

కదిరి, ఏప్రిల్ 9: శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణం లోని శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉగాది ప ర్వ దినం సందర్భంగా మంగళవారం రాత్రి అర్చకులు, వేది పండితులు పంచాగాన్ని చదివి వినిపించారు. క్రోధి నామ సంవత్సరంలో ఏ రాశి ఫలాలు ఎలా ఉన్నాయో వివరించారు. టీడీడీ నుంచి వచ్చిన పంచాగాన్ని అర్చకులు వివరంగా వినిపించారు. పలువురు భక్తులు, శ్రద్ధగా తమ రాశి ఫలాలను తెలుసుకున్నారు. తరువాత స్వామివారికి ఉయ్యాల సేవ నిర్వహించారు. వివిధరకాల పుష్పాలతో స్వామిని అలంకరించి ఉయ్యాలలో ఆస్థానం చేసి, శ్రీదేవి, భూదేవి సమేతంగా ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆధారాలున్నా..అలసత్వమే!

ఫీల్డ్ అసిస్టెంట్లపై ఆ అధికారికి అవ్యాజమైన ప్రేమ.. ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేదంట.. అధికారపార్టీకి డ్వామా అధికారుల వత్తాసు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 9: అధికార పార్టీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లపై జిల్లా అధికారి అవ్యాజమైన ప్రేమ చూపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు వ్యవహరిస్తే వెంటనే వారిని విధుల నుంచి తప్పించాలనే నిబంధనకు తూట్లు పొడుస్తున్నారు. ఎన్నికల్లో శింగనమల, రాప్తాడు, ఉరవకొండ ప్రాంతాల్లో అధికార పార్టీ అభ్యర్థుల తరఫున ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల సంఘం వారిని గుర్తించి వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని డ్వామా అధికారులను ఆదేశించింది. అయితే ఆ ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రచారంలో పాల్గొనలేదని, అవన్నీ పాత ఫొటోలు అని వివరణ ఇవ్వండి అంటూ డ్వామా అధికారులు బాధ్యులైన ఫీల్డ్ అసిస్టెంట్లకు నోటీసులు ఇచ్చారు. ఇదంతా ఎన్నికల సంఘాన్ని బురిడీ కొట్టించడానికే అనే విమర్శలు ఆశాఖలో వ్యక్తం అవుతున్నాయి.

గ్రామాల్లో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా ప్రచారం

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అధికార వైసీపీ వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా తన చేతిలో ఉన్న అన్ని వనరులను వాడుతోంది. ఈక్రమంలోనే గ్రామీణ ప్రజలతో మమేకమైన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను ఎన్నికల ప్రచారానికి వాడుకుంటోంది. క్షేత్రస్థాయిలో ప్రజలను మభ్యపెట్టేందుకు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎర వేస్తున్నారు. ఇదంతా జిల్లా యంత్రాంగం పరిశీలిస్తోందా లేదా అనే సందేహం వ్యక్తమవుతోంది. శింగనమల, కళ్యాణదుర్గం, తాడిపత్రి, రాయదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో అధికంగా ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రచారంలో పాల్గొంటున్నట్లు ఆధారాలు లభిస్తున్నాయి. ఆయా సంఘటనలపై అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ప్రజలతో నేరుగా క్షేత్రస్థాయిలో సంబంధాలు ఉండే ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లకు నోటీసులతో సరి

సార్వత్రిక ఎన్నికల్లో అధికారపార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారంలో పాల్గొన్న నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించలేదు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రచారంలో పాల్గొన్న ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించకపోగా ఆ ఉద్యోగులకు బాసటగా నిలవడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. కూడేరు మండలం మరుట్ల ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ బయపురెడ్డి, రాప్తాడు మండలం గాండ్లపర్తి ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్, శింగనమల మండలం గురుగుంట్ల ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ గంగాధర్‌రెడ్డి, వెస్ట్ నరసాపురం ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్‌లను తొలగించాలని ఫొటో ఆధారాలతో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అయితే ఎన్నికల సంఘం నిబంధనలు, ఆదేశాలు బేఖాతర్ చేస్తూ డ్వామా అధికారులు ఆ ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించలేదు. అక్కడితో ఆగక...ఆ ఉద్యోగులు ప్రచారంలో పాల్గొనలేదని, వచ్చిన ఆరోపణలకు వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు.

రియల్ దందా



లే అవుట్‌లో వేసిన తారు రోడ్డు

రాయదుర్గం నలుమూలలా విస్తరణ
ఐదేళ్లలో యాభైకి పైగా అక్రమ లే అవుట్లు
ప్లాట్ల వ్యాపారంతో ఆర్థికంగా బలపడ్డ వైసీపీ నాయకులు
రియల్ ఎస్టేట్ ద్వారా రూ. 312.60 కోట్ల టర్నోవర్
అనుమతులు లేకనే రోడ్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు

రాయదుర్గం, ఏప్రిల్ 9: అధికారం అండతో వైసీపీ నాయకులు రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని మాఫియాలా నడిపించి కోట్లు కొల్లగొట్టారు. కొందరు ప్రభుత్వ అధికారులు ముడుపులు పుచ్చుకుని మిన్నకుండిపో యారు. దీంతో రాయదుర్గం పట్టణం చుట్టూ అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. అది ఏభూమి అయినా కానీ దర్జాగా చదును చేయడం, రాళ్లను పాతడం, ప్లాట్లుగా విడగొట్టి, ఆకట్టుకునే విధంగా ఒక పేరు పెట్టి వెంచర్‌ను చూపుతూ బ్రోచర్‌ను మార్కెట్‌లో వదిలేయడం. ప్రభుత్వానికి నామమాత్రపు పన్నులు చెల్లించి, అక్రమ లేఅవుట్ల ద్వారా జేబులు నింపుకున్నారు. ఇలా ఐదేళ్లపాటు వైసీపీ నాయకులు రియల్ వ్యాపారాన్ని జోరుగా నిర్వహించి కోట్లలో సొమ్ము చేసుకున్నారు. రాయదుర్గం అర్బన్‌లోనే సుమారు 50కు పైగా అక్రమ లేఅవుట్లు వేసి రూ. 312.60 కోట్ల టర్నోవర్ చేశారని ప్రాథమిక అంచనా. రియల్ అక్రమ దందాతో 2019లో సామాన్య వైసీపీ కార్యకర్తలుగా ఉండి ఆర్థికంగా బలహీనులుగా ఉన్న వారంతా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో చొరబడి అక్రమ లేఅవుట్లు వేసి కోట్లు సంపాదించారు. వారంతా ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేస్తున్న వైసీపీ అభ్యర్థికి వెన్నంటి ఉంటూ, మరో ఐదేళ్ల అవకాశం కోసం నానా అవస్థలు పడుతున్నారు. అయితే అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొన్నవారు మాత్రం ఇళ్ల నిర్మాణం చేపట్టాలంటే మున్సిపాల్టీ అనుమతి కోసం జేబుకు చిల్లు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వెంచర్‌కో రేటు

సాధారణంగా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో వ్యవసాయభూములను కొనుగోలు చేసి వెంచర్‌లుగా వేసుకుంటారు. ఇక్కడ వెంచర్ వేయాలంటే ముందుగా వ్యవసాయేతర భూమిగా మార్చుకోవాలి. అందుకు రెవెన్యూ అధికారులకు పన్ను చెల్లించాలి. అయితే అనుమతులు ఇవ్వడానికి ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నుతో పాటు అధికారులకు రెండింతలు చెల్లించాల్సి ఉంటుంది. అప్పుడే అనుమతులు లభిస్తాయని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి తెలిపారు. అంతే కాకుండా రెవెన్యూ రికార్డులలో భూమికి సంబంధించి చిక్కులు ఉన్న వాటిని క్లియర్ చేసేందుకు కూడా ఒక రేటు మాట్లాడుకుని వ్యాపారానికి ఆటంకం లేకుండా ముందుకు వెళతారు. ప్రస్తుతం వేసిన లేఅవుట్‌లలో చాలా వరకు నాన్‌అగ్రికల్చర్‌గా మార్చుకుని వేసినవే. వ్యవసాయేతర భూమిగా మార్చిన అనంతరం అందులో పరిశ్రమల నిర్మాణమా, నివాస గృహాల నిర్మాణమా అనే విషయం మాత్రం ఆ సర్వే నంబర్లపై ఉండదు. దీంతో మున్సిపల్ యంత్రాంగం ఈ వ్యవహారాన్ని పరిశీలించాల్సి ఉంటుంది. ఇక్కడ కూడా అధికారపార్టీ నాయకుల పైరవీలతో వ్యాపారానికి సంబంధించిన వ్యవహారాలన్నీ సజావుగా సాగిపోతాయి. ముడుపుల మత్తులో ఉన్న కొందరు అధికారులు కళ్లముందే అక్రమ లేఅవుట్లు కనిపిస్తున్నా వాటిని టచ్ చేసే సాహసం చేయరు. దేవదాయశాఖ వివాదాలున్న భూముల్లో కూడా వైసీపీ నాయకులు చక్రం తిప్పి దండుకున్నారు.

అక్రమ రోడ్లు, విద్యుత్ కనెక్షన్లు

అక్రమ లేఅవుట్లలో రోడ్లు, విద్యుత్ స్తంభాలు కూడా అక్రమంగానే వేసేస్తారు. మున్సిపల్ కార్యాలయంలో అక్రమ లేఅవుట్ల వివరాలు ఏమాత్రం ఉండవు. దీంతో పాటు రోడ్లు ఎక్కడ ఉన్నాయనే విషయం కూడా వారికి తెలియదు. కానీ ఈ అక్రమ లేఅవుట్లలో మాత్రం ఆర్అండ్‌బీ రహదారులకు తీసిపోనట్లుగా తారురోడ్లు ఉంటాయి. దీంతో పాటు వీధి దీపాలు వెలగడానికి అవసరమైన విద్యుత్ స్తంభాలు కూడా సిద్ధంగా ఉంటాయి. లేఅవుట్లలో అక్రమంగా విద్యుత్ స్తంభాలు ఉన్నాయనే విషయాన్ని మాత్రం పట్టించుకునే పరిస్థితిలో ఉండరు. అనుమతులు తీసుకొని రోడ్లు వేయాలన్నా, విద్యుత్ స్తంభాలు నాటాలన్నా ఆయా శాఖలకు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. వాటన్నింటిని ఎగ్గొట్టి అధికార దర్పాన్ని ప్రయోగించి దోచుకోవడమే లక్ష్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని ఎంచుకున్నారు.

వైసీపీ కీలక నేతలే రియల్టర్లు

వైసీపీ కీలక నేతలే రియల్ ఎస్టేట్ వ్యాపారుల అవతారమెత్తి కోట్లు గడిస్తున్నారు. ముఖ్యంగా రాయదుర్గం నుంచి అనంతపురం వెళ్లే మార్గంలో వేసిన మూడున్నర ఎకరాల అక్రమ లేఅవుట్‌లో వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి భాగస్వామిగా ఉన్నారని ఆరోపణలు వస్తున్నాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్పకు సమీప బంధువు కీలక పాత్ర పోషించి ఎకరా రూ. 2.25 కోట్లతో కొనుగోలు చేసి సెంటు రూ. ఆరు లక్షల ప్రకారం ప్లాట్లను విక్రయిస్తున్నట్లు తెలిసింది. దీని ప్రకారం ఎకరాను దాదాపు రూ. 4 కోట్ల దాకా ప్లాట్ల రూపంలో విక్రయిస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. బీటీపీ రోడ్డులో మున్సిపల్ ప్రజా ప్రతినిధి ఎకరా రూ. కోటి ప్రకారం కొనుగోలు చేసిన నాలుగు ఎకరాల భూమిలో అక్రమ లేఅవుట్ వేసి ప్లాటు రూ. నాలుగు లక్షల ప్రకారం విక్రయిస్తు న్నారు. దీన ప్రకారం ఎకరాపై రూ.60 లక్షలకుపైగా ఆదాయం వస్తోంది. అదే రోడ్డులో వైసీపీ నామినేటెడ్ పదవి పొందిన నాయకుడు ఎకరా భూమిని రూ. కోటితో కొనుగోలు చేసి ప్లాటు రూ. ఐదు లక్షల ప్రకారం విక్రయిస్తున్నారు. సుమారు రూ.కోటికిపైగా ఆదాయం రానున్నట్లు బహిరంగంగా వినిపిస్తోంది. బళ్లారిరోడ్డులో ఎకరా రూ. 70 లక్షల ప్రకారం మూడున్నర ఎకరాలు కొనుగోలు చేసి రూ.1.5 కోట్లకు ప్లాట్ల రూపంలో విక్రయించారు. ఎన్నికల హడావుడి ఉండగానే వెంచర్లు వేయడానికి భూమి కొనుగోలు చేస్తున్నారు. కొందరు వైసీపీ నాయకులు సమష్టిగా ఏర్పడి అడిగుప్పరోడ్డుకు 14 ఎకరాల భూమిని రూ. కోటి ప్రకారం ఎకరా కొనుగోలు చేసి అందులో ఉన్న చింతచెట్లను తొలగించి వెంచర్ వేయడానికి సన్నద్ధం అవుతున్నట్లు చర్చలు జోరుగా వినిపిస్తున్నాయి.

కోట్లలో టర్నోవర్

అక్రమ లేఅవుట్ల వ్యాపారంలో గడచిన ఐదేళ్లలో రూ. 312.60 కోట్లకుపైగా టర్నోవర్ చేసి కోట్లలో లాభాలు ఆర్జించారు. ప్రతి ఏడాది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వారా మాత్రమే రూ. 10 కోట్ల దాకా పన్ను వసూలు అవుతోంది. ప్లాట్ల కొనుగోలుదారులు ఏడు శాతం ప్రకారం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. దీంతో ఐదేళ్ల కాలంలో రూ. 50 కోట్ల దాకా ప్రభుత్వానికి అక్రమ లేఅవుట్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ ఫీజు వసూలయినట్లు తెలుస్తోంది. అక్రమ లేఅవుట్ల నుంచి ఏ స్థాయిలో వైసీపీ నాయకులు దండుకున్నారో స్పష్టమవుతోంది.



కాంగ్రెస్ గిఫ్ట్ రాజకీయం

- రూ. 5వేల విలువైన కార్డుల పంపిణీ
- బీజేపీ ఎమ్మెల్యే మునిరత్న తీవ్ర ఆరోపణ



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మునిరత్న


బెంగళూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు గ్రామీణ లోక్‌సభ పరిధిలో గిఫ్ట్ పాలిటిక్స్ జోరుగా సాగుతున్నాయని రాజరాజేశ్వరినగర్ బీజేపీ ఎమ్మెల్యే మునిరత్న తీవ్రమైన ఆరోపణ చేశారు. ఎన్నికలకు ముందే ప్రతి కుటుంబానికి రూ. 5వేల విలువైన కార్డులు ఇస్తున్నారని పేర్కొన్నారు. గత శాసనసభ ఎన్నికలలోనూ రూ. 5వేల విలువైన కార్డులను పంచి ఐదు నియోజకవర్గాల్లో గెలుపొందారని, మరోసారి అదే విధానం పాటిస్తున్నారని అన్నారు. ఇప్పటికే చీరలు, కుక్కర్లు పంపిణీ చేశారని, తాజాగా కార్డుల పంపిణీ సాగుతోందన్నారు. ఆర్ఆర్ నగర్‌లో వివిధ కేసుల్లో ఉండే పలువురు రౌడీలను విడుదల చేయిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేస్తే ఊరు వదిలి వెళ్లాలని హెచ్చరిస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టర్ల సొమ్ము వస్తోందని ఆరోపించారు. ఎడమచేతిలో డబ్బు తీసుకుని, కుడి చేత్తో డాక్టర్‌కు ఓటు వేయాలన్నారు. బీజేపీ అభ్యర్థి సీఎన్ మంజునాథ్ 38 ఏళ్లుగా డాక్టర్‌గా ఎంతోమందికి సేవలందించారన్నారు. కేవలం జీతంతోనే జీవితాన్ని సాగించారని, ఆయన తలచుకుని ఉంటే ఎప్పుడో కోరుకున్న పదవికి వెళ్లేవారన్నారు.

ఎమ్మెల్యే వినయ్‌కులకర్ణికి మరోసారి ఎదురుదెబ్బ

బెంగళూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎమ్మెల్యే వినయ్‌కులకర్ణికి కోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ధారవాడ జిల్లా హుబ్బళ్లి జిల్లా పంచాయతీ సభ్యుడు యోగేశ్‌గౌడ హత్య కేసు నుంచి ఉపశమనం కలిగించాలని ధారవాడ ఎమ్మెల్యే కులకర్ణి దాఖలు చేసుకున్న పిటీషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. దీంతో వినయ్ కులకర్ణికి న్యాయపోరాటంలో మరోసారి నిరాశ మిగిలింది. బెంగళూరు సిటీ సివిల్ కోర్టు ప్రత్యేక న్యాయస్థానంలో కొనసాగుతున్న కేసును కొట్టివేయాలని వినయ్‌కులకర్ణి హైకోర్టును ఆశ్రయించారు. న్యాయమూర్తి కృష్ణ ఎస్ దీక్షిత్ ధర్మాసనం సోమవారం తీర్పు ప్రకటించింది. విచారణ వేళ పిటీషనర్ తరఫు న్యాయవాదులు పలు అంశాలు లేవనెత్తారు. చార్జ్‌షీట్‌లో అంశాలను నిందితుడికి సమకూర్చలేదని, మొదటి ముద్దాయి బసవరాజ్ ముత్తగికి మాత్రమే ముందస్తు అనుమతి పొందారని, వినయ్‌కులకర్ణి విషయంలో దాఖలు చేయలేదన్నారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం పిటీషన్‌ను కొట్టివేసింది. దీన్నిబట్టి మరింతకాలం ఆయన ధారవాడకు దూరంగానే ఉండాల్సి ఉంటుంది. ధారవాడ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న వినయ్‌కులకర్ణికి నగరంలో ప్రవేశించకుండా ఆంక్షలు ఉన్నాయి. శాసనసభ ఎన్నికలకు ముందు నుంచి ఆయన ధారవాడలోకి రాలేకపోయారు.

డీకే ముందు బీజేపీ నేత కుమార్తె కంటతడి

బెంగళూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకుడు, మాజీ మంత్రి సీపీ యోగేశ్వర్ కుమార్తె నిషా యోగేశ్వర్ కాంగ్రెస్‌లో చేరే ప్రయత్నం కొనసాగిస్తున్నారు. సోమవారం కేపీసీసీ కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ముందు నిషా కంటతడిపెట్టారు. తనను పార్టీలో చేర్చుకోవాలని కోరారు. అందుకు డీకే శివకుమార్ తిరస్కరించారు. భవిష్యత్తులో చూద్దామంటూ దాటవేశారు. కొన్నిరోజుల క్రితం డీకే శివకుమార్, బెంగళూరు గ్రామీణ అభ్యర్థి డీకే సురేశ్‌ను నిషా యోగేశ్వర్ భేటీ అయ్యారు. పార్టీలో చేరే అంశంపై చర్చించారు. అప్పట్లోనే డీకే శివకుమార్ రాజకీయాల కోసం తండ్రీకూతుళ్లను దూరం చేయాలని భావించడం లేదన్నారు. వివాహం కాని యువతి ఏదో ఆలోచనలు, ఆవేశంతో నిర్ణయం తీసుకుని ఉండవచ్చు అన్నారు. తండ్రి స్థానంలో ఉంటూ నన్ను ఆశీస్సులు కోరారన్నారు. నిషా తల్లి తనకు తెలిసినవారన్నారు. నిశా మాట్లాడుతూ ఎక్కడకు వెళ్లినా కాంగ్రెస్‌లో చేరినందుకు సంతోషంగా ఉందని, పలువురు అభినందిస్తున్నారన్నారు. కాంగ్రెస్‌లో పనిచేయడం ఇష్టంగా భావిస్తున్నా అన్నారు. కాగా మాజీ మంత్రి సీపీ యోగేశ్వర్ బీజేపీ అభ్యర్థి డాక్టర్ సీఎన్ మంజునాథ్ ప్రచారంలో బిజీగా ఉన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,579.18	1,578.72
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	293	3,289
సామర్థ్యం (టీఎంసీలు)	4.08	3.88

పోలింగ్ రోజు వేతనంతో సెలవు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్‌కమార్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 9: లోక్‌సభ ఎన్నికలు మే 7న జరుగనున్నందున జిల్లాలోని పారిశ్రామిక యూనిట్లు సహా చిన్న పెద్ద యూనిట్లలో పనిచేస్తున్న సిబ్బందికి వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి డిప్యూటీ కమిషనర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా సూచించారు. జిల్లాకలెక్టర్ కార్యాలయంలోని కేస్వాన్ వీడియో హాల్లో సోమవారం సాయంకాలం జిల్లావాణిజ్య పారిశ్రామిక సంస్థ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 7న ఫ్యాక్టరీలు, దుకాణాలు, వాణిజ్య సంస్థలు, ఇతర సంస్థల యజమానులు కార్మికులు ఓటింగ్‌లో పాల్గొనేందుకు వీలుగా వేతనంతో కూడిన సెలవును అందించాలని, ఈ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే సంబంధిత సంస్థ యజమాన్యంపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పంచాయితీ కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప మాట్లాడుతూ జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంపొందించేందుకు పారిశ్రామిక వాడల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈసందర్భంగా జిల్లాపంచాయితీ ముఖ్య ప్రణాళిక అధికారి వాగీష్ శివాచార్య, జిల్లాపారిశ్రామిక కేంద్రం సంయుక్త సంచాలకులు పోమశేఖర్ జిల్లా వాణిజ్య పరిశ్రమల సంస్థ ఉన్నతాధికారులు, వివిధ వ్యాపారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి ఉగాది పూజలు



పూజలందుకుంటున్న ఆనెగొంది దుర్గాదేవి

కంప్లి, ఏప్రిల్ 9 : ఆనెగొంది కిష్కిందలోని దుర్గామాతకు ఉగాది పండుగను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది పండుగ సందర్భంగా భక్తాదులు ఆయా ఆలయాలకు పోటెత్తారు. పూలు, పండ్లతో మొక్కులు సమర్పించుకున్నారు. అలాగే బుక్కసాగర వద్ద వుండే ఏళుపడగల నాగప్పకు కూడా పండుగను పురస్కరించుకుని పూజలు నిర్వహించారు. భక్తాదులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాల్లో మొక్కులు సమర్పించుకుని పూజలు చేపట్టారు.

రోడ్డు పక్కన మొక్కలకు నీటి సరఫరా

కంప్లి, ఏప్రిల్ 9 : అటవీ శాఖ అధికారులు రోడ్డుకు ఇరువైపులా వున్న మొక్కలకు రెండు రోజులకొకసారి నీటిని ట్యాంకర్ల ద్వారా వదులుతున్నారు. మెట్రి నుంచి దేవసముద్రం వరకు రోడ్డుకిరువైపులా వేసిన మొక్కలను పశువులు ధ్వంసం చేయకుండా కంచె ఏర్పాటు చేశారు. వాటికి రెండు రోజులకోసారి ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. అధికారులు మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు, చెట్లు వుంటే బాటసారికి కొంత సేద తీరేందుకు వీలవుతుందన్నారు. అందుకుగాను తమ శాఖ రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి వాటి పెంపకం చేపడుతున్నట్లు తెలిపారు.

ఫారం-12ఏ నింపడం తప్పనిసరి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 9: లోక్ సభ నియోజకవర్గ ఎన్నికలకు కేటాయించిన అధికారులు,సిబ్బంది తప్పనిసరిగా ఫారం-12ఏ నింపాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ప్రశాంత్ కమార్ తెలిపారు. జిల్లాకలెక్టర్ కార్యాలయ ఆవరణలోని గాంధీభవన్ హాల్లో బళ్లారి లోక్ సభ ఎన్నికలకు సంబంధించి విధులు నిర్వహిస్తున్న అధికారులకు ఫారం-12ఏ పంపిణీకి సంబంధించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ రోజున కేటాయించిన అధికారులు, సిబ్బంది వారు విధులు నిర్వహిస్తున్న పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేయడానికి వీలుగా ఈ ఫారమ్‌ను జారీ చేయాల్సి ఉంటుందన్నారు. ఈవారం సెలవులు ఉన్నందున ఏప్రిల్ 23వరకు ఫారం నింపి సమర్పించేందుకు సమయం ఉంటుందని తెలిపారు.

జేడీఎస్‌కు జనాదరణ తగ్గిందా?

దేవెగౌడ కుటుంబ రాజకీయాలతో పార్టీకి దూరమవుతున్న కీలక నేతలు

బళ్లారి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలో పుట్టి, జాతీయ రాజకీయాల వరకూ ఎదిగిన జనతాదళ్(ఎస్) పార్టీపై జనంలో ఆదరణ తగ్గుతోందనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల్లో వ్యక్తం అవుతోంది. జేడీ(ఎస్) తరపున 2004లో ఏకంగా 54 మంది ఎమ్మెల్యేలు గెలవగా దేవేగౌడ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టారు. అలాగే దేశ ప్రధాని పదవి కూడా చేపట్టారు. అలాంటి పార్టీ నేడు తన పట్టును కోల్పోతుందనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటకలో జనతాదళ్ గతంలో బలంగా ఉండేది. దాని నుంచి జేడీ(యూ) జేడీ(ఎస్) పార్టీలు పుట్టుకొచ్చాయి. తరువాత జేడీ(యూ) జేడీ(ఎస్) పార్టీలు కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేశాయి. కాలక్రమేణా జేడీ(యు) పార్టీ చాలా వరకూ జేడీ(ఎస్) పార్టీలో కలిసిపోయింది. కర్ణాటక రాష్ట్రంలో జేడీ(ఎస్) పార్టీకి 1994, 2004, 2008-09వరకూ మంచి ఓటు బ్యాంక్ ఉండేది. దేవేగౌడ కుటుంబం సరైన సమయంలో ఖచ్చితమైన రాజకీయ నిర్ణయాలు తీసుకోకపోవడం కారణంగా చాలా వరకూ కీలక నాయకులతో పాటు ఓటర్లు దూరం అయ్యారు. దేవేగౌడ కుటుంబంలో కొడుకులు, మనవళ్లు, పార్టీ పదవుల కోసం పోటీ పడుతుండడం, అలాగే పార్టీని అంటుపెట్టుకుని ఉండే నాయకులకు పదవులు ఇవ్వకుండా కీలక సమయంలో మాట మార్చడం కారణంగా కూడా పార్టీ పైన నమ్మకం పోయిందని కొందరు అంటున్నారు.

ఓ సారి కాంగ్రెస్‌తో దోస్తీ చేయడం, మరోసారి బీజేపీతో జతకట్టడం ఇంకోసారి మరో పార్టీలతో కలవడం ఇలా రాజీయంగా ఒక వ్యూహం లేకుండా నడుచుకుంటూ ఉండడం కారణంగా రాష్ట్రంలో మంచి స్థానంలో ఉండే పార్టీ నేడు దాదాపు కొంత ఏరియాకే పరిమితమయింది. మామూలుగా జాతీయ పార్టీల విధానంపై విసుగెత్తి ప్రాతీయపార్టీల వైపు జనం మొగ్గుచూపుతారు. అలాంటి ప్రాంతీయ పార్టీలు చాలా రాష్ట్రాల్లో మనుగడ కొనసాగిస్తూ అధికారం నడుపుతున్నాయి. కానీ కర్ణాటకలో మాత్రం ముఖ్యంగా జనతాదళ్(ఎస్) తన స్వయం కృపారాధంతోనే ఆదరణ కోల్పోతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో హైద్రాబాద్ కర్ణాటక, మధ్యకర్ణాటక, ఉత్తర కర్ణాటక జిల్లాలో గతంలో జేడీ(ఎస్) పార్టీ బలంగా ఉండేది. కానీ ఇప్పుడు కేవలం మైసూర్, మండ్య, హసన్ జిల్లాలకే పరిమితం అయిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

2004లో బళ్లారి జిల్లా కురుగోడు నుంచి నారా సూర్యనారాయణ రెడ్డి జేడీ(ఎస్) తరపున గెలిచారు. అలాగే ఎంపీ ప్రకాష్, సంతోష్ లాడ్ లాంటి నాయకులు కూడా జేడీ(ఎస్) నుండి ఎమ్మెల్యేలుగా గెలిచిన వారే. ఇలా చెప్పుకుంటూపోతే అనేక ఉదాహరణలు ఉన్నాయి.



పార్టీలో కుమారుల పెత్తనం, అలాగే రేవణ్ణ ఒక నిర్ణయం తీసుకుంటే కుమార స్వామి అందుకు విరుద్ధంగా నిర్ణయం తీసుకోవడం ఇద్దరి నిర్ణయాలూ కాదని దేవేగౌడ ఇంకో నిర్ణయం తీసుకోవడం కారణంగా పార్టీలో ఉండే కార్యకర్తలు నాయకులు ఇబ్బంది పడుతూ వచ్చారు. 2014లో రాజ్యసభ సీటు, ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో తండ్రి ఒకరికి మాట ఇస్తే కుమారులు ఇంకొకరికి మాట ఇవ్వడంతో పార్టీ రచ్చకెక్కింది. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా పార్టీనే నమ్ముకుని ఉండే నాయకులు, కార్యకర్తలు వీరి నిర్ణయాలకు విసుగెత్తి పోయారు. గతంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కూడా రాజీనామా చేశారు. అలాగే 2023లో జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో పార్టీకి ఒక విధివిధానం లేక వేరే పార్టీతో జత కట్టడంతో పార్టీ ని నమ్ముకుని ఉండే నాయకులు ఇబ్బందులపాలయ్యారు. బళ్లారి, రాయచూరు ఇతర ప్రాంతాల్లో పార్టీ లో ఉండే మున్నాబాయ్ లాంటి వారికి బళ్లారి నుండి ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి పార్టీ బి-ఫారం ఇచ్చి తరువాత సీ పారం ను అనీల్ లాడ్‌కు ఇచ్చారు. దీంతో ఆయన పార్టీ మారిపోయారు. ఇలా చెప్పుకుంటూ పోతే జేడీ(ఎస్) పార్టీ కుటుంబ పార్టీగా మారిపోవడంతో ఓటర్లు కూడా తగ్గిపోతున్నారు. ఒకప్పుడు ఈ పార్టీకి ఓటింగ్ శాతం ఎక్కువగా ఉండేది. ప్రస్తుతం ఓటింగ్ శాతం బాగా తగ్గిపోయిందని గతంలో జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల ఓటింగ్‌ను బట్టి తెలుస్తోంది. మొత్తం మీద జేడీ(ఎస్)నాయకుల స్వయం కృతాపరాధంతో పార్టీ ఉనికి కోల్పోయేలా పరిస్థితి మారింది.

వైభవంగా ఆంజనేయ రథోత్సవం



భక్తజనం మధ్య సాగుతున్న రథోత్సవం

కంప్లి, ఏప్రిల్ 9 : తాలుకా పరిధిలోని దేవలాపురం గ్రామంలో ఆంజనేయస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ఈ యేడాది నూతన రథం కావడంతో ప్రతి ఇంటా మహిళలకు ఒడినింపే కార్యక్రమం నిర్వహించారు. ఉదయం వేళ మడితేరుకు షడక్షరీ కరిసిద్దేశ్వర శివాచార్యులు, మహేశ్వర శివాచార్యులు, మహదేవ తాత, రేవణ సిద్దేశ్వర స్వాములు తదితరులు పూజలు చేపట్టారు. సాయంత్రం వేళ ఆలయం నుంచి ఎదురు బసవన్న కట్ట వరకు రథాన్ని ఊరేగించారు. ఈ రథోత్సవ కార్యక్రమంలో దరోజీ, సోమలాపురం సుగ్గినళ్లి, జవుకు, జానూరు, దేవసముద్రం, మెట్రి, కంప్లి, తదితర గ్రామాల నుంచి భారీ ఎత్తున భక్తులు పాల్గొని మొక్కులు సమర్పించుకున్నారు. ఆంజనేయస్వామి దేవస్థానం పదాధికారులు సేవలు చేపట్టారు. అలాగే అన్న ప్రసాదాలు కూడా ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కుడితిని పోలీసులు ఎలాంటి ఘటన జరగకుండా ఎస్ఐ ఉలిగేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

వ్యాపారులపై ఎన్నికల సంఘం డేగకన్ను



అమ్మకానికి సిద్ధంగా ఉన్న రంగు రంగుల దుస్తులు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 9: ఉగాది, రంజాన్ పండుగలను సాకుగా చూపి రాజకీయ పార్టీల నేతలు, అభ్యర్థులు ఓటర్లకు కానుకలు ఇచ్చే అవకాశంపై ఎన్నికల సంఘం డేగ కన్ను వేసింది. హిందువుల అతి పెద్ద పండగ ఉగాది కాగా, ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. కొత్తబట్టలు, నగలు కొనుగోలు చేసేందుకు దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. ప్రజలు దుస్తులు, అభరణాలు, కిరాణాలుషాపుల్లో కొనుగోళ్లకు పరుగులు తీస్తున్నారు. ఇదే అవకాశంగా భావించి పండుగ పేరుతో ఓటర్లకు కానుకలు ఇచ్చేఅవకాశం ఉంది. దీనిపై ఎన్నికల సంఘం డేగ కన్ను వేసింది.

- వస్త్ర వ్యాపారం కూడా కష్టం

బట్టల వ్యాపారంపైనా నిఘా పెట్టారు. ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా కొత్తబట్టలు కొనడం ఆనవాయితీ. ఎన్నికల నిబంధనల దృష్ట్యా ఈసారి ఉగాది, రంజాన్ పండుగలకు మంచి వ్యాపారం జరుగుతుందన్న అంచనాలు తారుమారయ్యాయి. అయితే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ప్రతి వస్త్ర విక్రయానికి సంబందించిన వివరాలను ఎన్నికల సంఘం అడుగుతోందని బట్టల వ్యాపారి నాగరాజు వాపోయారు.

ఎస్‌యూసీఐ అభ్యర్థికి ఓటు ప్లీజ్!



ఎస్‌యూసీఐ అభ్యర్థికి ఓటు వేయాలని ఆటోడ్రైవర్లను అభ్యర్థిస్తున్న కార్యకర్తలు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 9: ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఎస్‌యూసీఐ కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి దేవదాస్‌కు ఓటు వేయాలని పార్టీ కార్యకర్తలు మంగళవారం ఆటో డ్రైవర్లకు విజ్ఞప్తిచేశారు. గత పదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రజల జీవితాలను నాశనం చేసిందని, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో పెట్రోల్, డిజిల్ ధరలు చాలా తక్కువగా ఉన్నప్పటికీ, భారతదేశంలో మాత్రమే కేంద్ర ప్రభుత్వం వాటి ధరలను తగ్గించలేదన్నారు. ఇలా ఒకవైపు కార్పోరేట్ యాజమాన్యాల జేబులు నిండుతుంటే మరోవైపు శ్రామిక ప్రజల జేబులు గుల్ల అవుతున్నాయన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామి ఇచ్చిన మోదీ ప్రభుత్వం ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. ఉద్యోగాలు లేకుండా యువత వీధిన పడుతోందని, కార్మికులు, ఆటో డ్రైవర్లు ఈ విషయాన్ని అర్థంచేసుకోవాలన్నారు. ఇలాంటి వాస్తవ సమస్యల నుంచి శ్రామిక ప్రజలను మళ్ళించేందుకు బీజేపీ కులమతాల పేరుతో మందిరం, మసీదు, సీఏఏ వంటి వాటిని తెరపైకి తెస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా ఇలాంటి ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేసిందన్నారు. ఈ పార్టీల అసలు స్వభావాన్ని అర్థం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా పార్టీ సభ్యులు సురేశ్, జగదీశ్, ప్రకాశ్, విద్య, రవకిరణ్, అనుపమ తదితరులు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

తుకారామ్ గెలుపు కోసం కాంగ్రెస్ నేతల పూజలు

కంప్లి, ఏప్రిల్ 9 : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఈ తుకారామ్ గెలుపు ఖాయమని కుడితిని పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజశేఖర్ తెలిపారు. ఆయన గెలుపు కోసం పట్టణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గతంలో బీజేపీ ఎంపీ అభ్యర్థులుగా వున్న శాంత, దేవేంద్రప్ప హయాంలో జిల్లాలో అభివృద్ధి శూన్యమన్నారు. ఐదు సంవత్సరాల పాటు గుర్తుండిపోయే ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదన్నారు. గతంలో బళ్లారి నుంచి పోటీ చేసిన సోనియాగాంధీ హయాంలోనే బళ్లారి పూర్తిగా అభివృద్ధి చెందిందని, ఇప్పుడు తమ నాయకుడు తుకారామ్ కూడా విద్యారంగంలో అనేక సేవలు చేశాడన్నారు. ఇలాంటి నాయకుడిని గెలిపించుకున్నట్లయితే జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. తమ నాయకుడు సండూరు క్షేత్రంలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు ఒకసారి మంత్రి కూడా అయ్యారన్నారు. బీజేపీ అభ్యర్థులు అభివృద్ధి చేయకపోవడంతోనే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తుకారామ్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తారని తెలిపారు.

బళ్లారిలో రంజాన్ రంగులు

సంబరాల్లో మునిగి తేలుతున్న ముస్లింలు

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 7: ముస్లింలు జరుపుకునే పండుగల్లో రంజాన్ పండుగకు ప్రత్యేక స్థానం ఉందని చెప్పవచ్చు. నెలరోజుల పాటు కఠినమైన ఉపవాస దీక్షలు పాటిస్తూ... రంజాన్ పండుగ దగ్గరపడుతున్న నేపథ్యంలో బళ్లారి నగరంలో పలు మసీదులు విద్యుత్ కాంతులతో వెలిగి పోతున్నాయి. అదేవిధంగా ఉపవాస దీక్షలు విరమించే వారికి సాయంత్రం వేళ ప్రత్యేక వంటకాలతో నగరంలోని పలు హోటళ్ళు ఆహ్వానం పలుకుతున్నాయి. రంజాన్ పండుగ సందర్భంగా వ్యాపార అంగళ్ళు విద్యుత్ కాంతులతో ముస్తాబు చేసి కొనుగోలు దారులకోసం ఎదురు చూస్తున్నాయి. సాయంత్రం అయితే చాలు పండ్లు కొనుగోలు చేసేందుకు వివిధ దుకాణాలు ఆహ్వానం పలుకతుండగా, కొత్తబట్టలు, అలంకార వస్తువుల కొనుగోలు కోసం ముస్లింలు కుటుంబ సభ్యులతో గుంపులు గుంపులుగా వస్తున్న దృశ్యాలు ప్రస్తుతం బళ్ళారి నగరంలో కనిపిస్తున్నాయి. 25రోజులుగా కౌల్‌బజార్, మిల్లార్‌పేట, బెంగళూరు రోడ్డు, రాయల్ సర్కిల్ హోటళ్ళు, వ్యాపార దుకాణాలు జనంతో నిండిపోయాయి హోటళ్ల, బట్టల దుకాణాల్లో జోరుగా వ్యాపారాలు సాగుతున్నాయి. పండుగ



ముస్లింలతో కిక్కిరిసిన దుస్తుల దుకాణం



రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబైన మసీదు

సమీపిస్తున్నందున నగరంలో వ్యాపారాలు జోరందుకున్నాయి. రంజాన్ మాసాన్ని ముస్లింలు అత్యంత ప్రవితంగా ఆచరిస్తారు. రోజంతా ఉపవాసం ఉంటూ సాయంత్రం అయ్యే సరికి రోజా ముగించి కుటుంబ సమేతంగా మార్కెట్‌కు వస్తుంటారు. మార్కెట్‌లో కొత్తటోపీలు, బుర్కాలు, చీరలు, గాజులు, అలంకార వస్తువులు, సుగంధ ద్రవ్యాలు, మెహెంది కొనుగోళ్లు జోరుగా జరుగుతుంటాయి. మార్కెట్‌లో కాలుపెట్టలేని స్థితిలో రద్దీఉంటుంది. రోజా ముగిసే సమయంలో దేశంలో సుఖశాంతులు లభించాలని, వర్షాలు కురవాలని, ప్రజలంతా సమృద్ధి చెందాలని ప్రార్థిస్తుంటారు. రంజాన్ మాసంలో తాము సంపాదించిన దానిలో రెండు శాతం దానం ఇవ్వడం ఆచారంగా వస్తోంది. ప్రతి ఒక్క పేద ముస్లిం కూడా పండుగను ఆచరించాలనే ఉద్దేశ్యంతో ఉన్నత కుటుంబాల వారు రంజాన్ పండుగ రోజున దానధర్మాలు చేస్తుండడం పరిపాటి. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షను ముగించే ప్రతి ఒక్కరు మొదట ఖర్జూరం తిన్నతరువాతనే ఆహారం స్వీకరిస్తారు. దీంతో మార్కెట్‌లో కూడా ఖర్జూరానికి డిమాండ్ పెరిగింది.

కనులపండువగా తాయమ్మదేవి రథోత్సవం



ప్రత్యేకాలంకరణలో శ్రీ తాయమ్మదేవి

సిరుగుప్ప, ఏప్రిల్ 9: శ్రీతాయమ్మదేవి మహరథోత్సవం మంగళవారం కనులపండువగా జరిగింది. సిరుగుప్ప పట్టణం ఆదోని మార్గంలో వెలసిన శ్రీ తాయమ్మదేవి ఆలయం వద్ద నుంచి ఎదురుబసవన్న కట్ట వరకు భక్తులు అమ్మవారి రథాన్ని లాగారు. రథంపై పూలు, పండ్లు విసిరి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు శ్రీనివాస, అమ్మవారికి గంగాజలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ చేపట్టారు. ఆంధ్రులు నివాసం వుండే విజయనగర కాలనీవాసుల ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన జరిగింది. ఈ కోలాటాన్ని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. ఈ యేడాది నూతన రథోత్సవం చూడడానికి భక్తులు కిక్కిరిసిపోయారు.

హోసూరు జోన్

ఆంధ్ర సాంస్కృతిక సమితిలో ఘనంగా ఉగాది



వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

హోసూరు, ఏప్రిల్ 9: హోసూరు నగరంలోని ఆంధ్ర సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సమన్వయ కర్త, విద్వాన్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం మనోహర్ పంచాంగ శ్రవణంతో ప్రారంభమైంది. అగరం వసంత్ రచించిన కవితా సంపుటిని రవికిరణ్, గడ్డం దేవీప్రసాద్‌లు ఆవిష్కరించారు. బస్తీ యువకుల బృందం 17 కవితా సంకలనాలను ఇప్పటివరకు విడుదల చేసినట్టు గడ్డం శ్రీనివాస్ తెలిపారు. స్థానిక కవులు, రచయితలను సత్కరించారు. సంప్రదాయంగా ఉగాది పండుగలో భాగంగా మజ్జిగ, పానకం, పెసరపప్పు పంపిణీ చేశారు. కథ మరిచిన మనిషి, తల్లివేరు పేరిట పుస్తకాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముత్తుకృష్ణన్, శ్రీనివాసులు, సూర్యనారాయణ, సత్యనారాయణ, రామస్వామిరెడ్డి, విజయ్‌కుమార్, ఆంధ్ర సాంస్కృతికసమితి అధ్యక్షుడు రామచంద్ర, అణ్ణయ్యప్ప తదితరులు పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో భాషాభిమానులు భాగస్వాములయ్యారు.

ఆలయాలకు ఉగాది శోభ

హోసూరు, ఏప్రిల్ 9: హోసూరు పరిసర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యల్లో కన్నడ, తెలుగు ప్రజలు ఉగాది పండుగను ఘనంగా ఆచరించారు. తలంటు స్నానం చేసి నూతన వస్త్రాలు ధరించి తమ కులదైవానికి పూజలు చేసిన అనంతరం తమ పూర్వీకులను స్మరించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. పలు ఆలయాలలో శుద్ధి, స్వామివార్లకు అభిషేకం, అలంకరణ అనంతరం పంచాంగ శ్రవణం నిర్వహించారు. భక్తులకు ఉగాది పచ్చడి, మజ్జిగ, పానకం పంపిణీ చేశారు. పలు ఆలయాలలో క్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని విశేషపూజలు నిర్వహించారు. ఉద్దనపల్లి సమీపంలోని కొత్తూరు గ్రామ కాళికాంబ ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు. కాగా ఎన్నికల కోడ్ కారణంగా రాజకీయ నాయకుల ప్రముఖులు ఎవరూ ఉత్సవాల్లో కనిపించలేదు.



విశేష అలంకరణలో కొత్తూరు గ్రామ కాళికాంబ

కొత్త ప్రయోగంతో వాహనదారులకు ఊరట

రాయచూరు, ఏప్రిల్ 9: నగరంలోని ప్రధాన రోడ్డు కూడళ్ల వద్ద సిగ్నల్ కోసం వేచి ఉండే వాహనదారులకు అధికారులు నీడ కల్పించే పందిరి ఏర్పాటు చేసి మన్ననలు పొందుతున్నారు. నగరంలోని వాహనదారులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు సహితం ఈ ఏర్పాటును చూసి ఇక్కడి అధికారులను ప్రశంసిస్తుండడం విశేషం. నగరంలో ఎండ వేడిమికి ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. ఈ ఏడాది మే నెలలో ఉండాల్సిన ఎండలు ఏప్రిల్ మాసంలోనే కనిపించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాయచూరులో మంగళవారం 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎండలు మండిపోతున్నాయి. నగరంలో ప్రధాన రోడ్డు కూడలిగా ఉన్న బసవేశ్వర సర్కిల్ వద్ద ఒక్కసారి ట్రాఫిక్ సిగ్నల్ పడితే ఆయా రోడ్డుల్లో వాహనాలు ఆగిపోయే ఏర్పాటు ఉంది. ఈ క్రమంలో ప్రస్తుతం వేసవిలో పెరిగిన ఉష్ణోగ్రతల నేపథ్యంలో వాహనదారులు రోడ్డుపై వేచి ఉండేందుకు తల్లడిల్లి పోయే వారు. తారురోడ్లన్నీ ఎండవేడికి కరిగిపోయి మరింతగా వేడి పెరగడంతో వాహనదారులు గ్రీన్ సిగ్నల్ కోసం వేచి ఉండడాన్ని నరకంగా భావించే వారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, కర్ణాటకలోని విజయపూర నగరాల్లో ట్రాఫిక్ కూడళ్ల వద్ద పోలీసులు స్థానిక సంస్థల సహకారంతో నీడను ఏర్పాటు చేసిన దాన్ని గుర్తించిన జిల్లా యంత్రాంగం నగరంలోని బసవేశ్వర సర్కిల్ వద్ద రోడ్లకు రెడ్ సిగ్నల్ సమయంలో వాహనాలు ఆగి ఉండే చోట పందిరి ఏర్పాటు చేయగా మిగతా చోట్ల కూడా ఇలాంటి ఏర్పాటు చేయాలంటు స్థానికులు కోరుతున్నారు.



బసవేశ్వర సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన నీడ పందిరి

పండుగల సందర్భంగా సామరస్యాన్ని పాటించాలి



శాంతిసభలో మాట్లాడుతున్న తుర్విహాళ్ ఎస్ఐ నాగరాజ

రాయచూరు, ఏప్రిల్ 9: రంజాన్ పండుగను ముస్లింలు సామరస్యంతో నిర్వహించుకోవాలని తుర్విహాళ్ ఎస్ఐ నాగరాజ కొటగి కోరారు. మంగళవారం జిల్లాలోని సింధనూరు తాలూకా తుర్విహాళ్ పోలీస్ స్టేషన్‌లో రెండు వర్గాల వారితో ఆయన శాంతి సమావేశం నిర్వహించారు. ముస్లింలు నిర్వహించుకునే రంజాన్ పండుగకు ప్రాముఖ్యత దృష్ట్యా పండుగ ఆచరణలో హింసా సంఘటనలకు తావు లేకుండా పరస్పరం శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని సూచించారు.